


# ప్రవాసం

పావని

రాయపూరు పాసెంజరు వాల్తేరు స్టేషనునుంచి కూతకూసి కదిలింది. రైలు కుదుపుతో మోహనరావు దేహం కన్నా మనస్సు ఎక్కువగా కదిలింది.

మోహనరావు ఇదివరకు చాలా ప్రయాణాలు చేశాడు. ఈ ప్రయాణం మాత్రం అలాంటిది కాదు. ఈ ప్రయాణం తన జీవితంలో ఒక మలుపును సూచిస్తుంది. ఇవాళతో తన జీవితంలో మొదటిఘట్టం ముగిసింది.

మోహనరావు తల్లిదండ్రులు గజపతి నగరంనుంచి వచ్చి విశాఖపట్నంలో స్థిరపడినవారు. మోహనరావు అక్కడే యూనివర్సిటీలో ఫార్మస్యూటికల్స్‌లో ఎమ్. ఎస్‌సి. పాసయి రెండేళ్లు అక్కడే పని చేశాడు. కాని కాలేజీలో ఉద్యోగం అంతగా లాభం లేదు. తాను చదివింది ఫార్మస్యూటికల్ టెక్నాలజీ. తన చదువుకి ఏదైనా ఫేక్టరీలో ఉద్యోగం దొరికితే మంచిది. ఫేక్టరీలో మంచి జీతాలిస్తారు. ఏదైనా ఫేక్టరీలో ఉద్యోగం సంపాదించడానికి తహతహపడ జొచ్చాడు. రెండేళ్లుగా అప్లికేషన్లు పెడుతూనే ఉన్నాడు. అతడు పెట్టినవాటిలో నూటికి తొంభై అప్లికేషన్లకి జవాబులు రాలేదు. జవాబు లిచ్చినవారు, మాకు ఫేక్టరీలో అనుభవం ఉన్నవారు కావాలి, కనుక ఈ ఉద్యోగం మీకు ఇవ్వజాలనందుకు చింతిస్తున్నాం అని జవాబు వ్రాశారు. మోహనరావుకి రానురాను విసుగు, కోపం, నిరాశ కలిగాయి. ఉద్యోగం దొరుకుతేగాని అనుభవం రాదు, అనుభవం ఉంటే తప్ప ఉద్యోగం ఇవ్వరు. ఈ చిక్కువలయంలో మోహనరావు రెండేళ్లు చిక్కుకొన్నాడు.

చివరకి అతనికి రాయపూరులో ఒక ఫేక్టరీలో ఉద్యోగం లభించింది. ఫేక్టరీ ఏమంత పెద్దదీ ప్రసిద్ధమైనదీ కాదు. అటువంటి ఫేక్టరీలో ఉద్యోగం ఏమంత కోరదగినది కాదు. కాని అంతకన్నా మంచి అవకాశం అతనికి లభించలేదు. లభించిన ఆ అవకాశాన్ని అతను వదలదలుచుకోలేదు. ఆ ఫేక్టరీలోనే కలకాలం ఉద్యోగంచేస్తూ ఉండిపోనక్కరలేదు తను. కాలుమోపే జాగా అది. దానిలో సంపాదించే అనుభవంతో రెండేళ్లలో మరో మంచి ఫేక్టరీలో ఉద్యోగం తప్పకుండా సంపాదించవచ్చును.

ఆ ఫేక్టరీలో ఉద్యోగంలో ఇంకొక వెలితి కూడా ఉంది. మందులు టెస్టింగ్ చేసే విభాగంలో అతనికి ఉద్యోగం దొరికింది. అది అంతగా ప్రయోజనకారి కాదు. మందులు తయారుచేసే విభాగమైతే ముందు ముందు చాలా లాభం. కాని ఏ అనుభవమూ లేని తనకు సూటిగా తయారీ విభాగంలో ఉద్యోగం దొరకడం అసంభవం. క్రమంగా సంపాదించవచ్చును. ఈ వెలితి ఉన్నా జీతం విషయంలో తాను అదృష్టవంతుడే. మూడువందల ఏభై రూపాయలు జీతం, ఇల్లూ కంపెనీవారు తనకి ఇస్తామన్నారు. అనుభవం లేని తనబోటివాడికి ఇంత జీతం ప్రారంభంలోనే ఇవ్వడం చాలా గొప్ప. ఈ విషయాలన్నీ ఆలోచించి, ఆ ఉద్యోగాన్ని అంగీకరించి, కాలేజీలో ఉద్యోగానికి రిజైనిచ్చి రాయపూరు బయలుదేరాడు.

ఒక్కడే బయలుదేరాడు. భార్య పూర్ణ గర్భిణి. అందువల్ల విశాఖపట్నంలోనే ఆమెను వదిలి బయలుదేరాడు.

ఇన్ని విధాలుగా తాను చెయ్యబోయే ఉద్యోగం గురించి మనస్సును సమాధానపరచుకొని అంతా తన బాగుకే అని నిస్సందేహంగా నిశ్చయించుకొన్నా ఇంకా తనమనస్సులో ఏదో పీకుతూనే ఉంది. అది తన జన్మస్థలాన్ని విడిచి వెళ్తున్న మనోవేదన. ఇరవై అయిదేళ్లకి పైగా తాను జీవించిన విశాఖపట్నాన్ని, పొట్ట చేత పట్టుకొని నేడు విడిచి పెడుతున్నాడు. ఆ ఊళ్లో ప్రతి వీధి,

ప్రతి సందూ తానెరుగును. చిన్నప్పుడు తన తోటి పిల్లలతో ఆడిన ఆటలు అతనికి జ్ఞాపకం వస్తున్నాయి. ఇంకా కొంచెం పెద్దయాక తన స్నేహితులు, బంధువులు, తెలుగు సినిమాలు; ఇంకా పెద్దయి కాలేజీలో చేరాక కాలేజీ నాటకసంఘం సెక్రెటరీగా తాను నిర్వహించిన కార్యక్రమాలూ ఇవన్నీ సినిమా రీళ్లలాగ మనోనేత్రం ముందు తిరుగుతున్నాయి. మోహనరావు బాగా పాడతాడు. సినిమాపాటలు, ఎంకి పాటలు, కృష్ణశాస్త్రి శ్రీశ్రీల గేయాలు ఇంకా ఎన్నో పాటలు భావయుక్తంగా ఇంపుగా పాడేవాడు. నాటకాలలో వేషాలు వేసేవాడు. కన్యాశుల్కంలో కరటక శాస్త్రివేషం వేసి ఉత్తమ నటుడుగా బహుమానం పుచ్చుకొన్నాడు. తాను విద్యార్థిగా ఉండి సెక్రెటరీగా ఉన్నన్నాళ్లూ కాలేజీ నాటక సంఘాన్ని గొప్పగా నడిపించాడు. తర్వాత డిమాన్‌స్ట్రేటరుగా ఉద్యోగంలో చేరాక కూడా వాటిలో తాను పాల్గొంటూ విద్యార్థులను ప్రోత్సాహమూ సలహాలూ ఇస్తూ ఉండేవాడు.

ఈనాటితో వీటన్నిటికీ తన జీవితంలో మంచి వీడ్కోలు చెబుతున్నట్టుగా అతనికి తోచింది. పాటలు, వినుపాటలు తన జీవితం! రాయపూరులో తన తెలుగు పాటలు ఎవరు వింటారు? రాయపూరులో కన్యాశుల్కంలో కరటక శాస్త్రి వేషం గొప్పగావేసి దాని విలువ చెప్పేవారు?

అయినా క్రొత్త ప్రదేశాలు, క్రొత్త వాతావరణంలోనూ ఒక ఆకర్షణ లేకపోలేదు. మొదట్లో కొంత చిరాకుగా ఉన్నా రానురాను ఆ వాతావరణానికి అలవాటుపడి ఉన్నట్టే ఒక క్రొత్త ఉత్సాహంతో జీవించ గలగవచ్చు.

ఇలా ఆలోచిస్తూ కూర్చున్నాడు. సింహాచలం, కొత్తవలస, విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి—తన జన్మస్థలం జరుగుతూ ప్రక్కనుంచి వెనుకకి పోయింది. గజపతినగరంలోంచి రైలు వెళ్తూ ఉండగా కిటికీదగ్గర నిలబడి కనుమూసుకునేలో కాల గేస్తున్న ఆ ప్రకృతిని కలయ చూశాడు. తనకు దక్కనూరంతా నిచ్చిన

ఊరు గడిచి పోయింది. సీతానగరం స్టేషను వచ్చింది. కేరియరు విప్పి భోంచేశాడు. చీకటి పడింది. రైల్లో జనం పల్చబడి పోయారు. పార్వతీపురంలో తక్కిన వారు కూడా చాలా మట్టుకు దిగి పోయారు. మిగిలిన వాళ్లలో ఎక్కువ మంది తెలుగువారే. కొద్దిమంది ఒరియా వారు, కొద్దిమంది రాయపూరు ప్రాంతం వారు. పైన పక్క పరచుకొని పడుకొన్నాడు. నిద్రరాలేదు. ఆలోచిస్తున్నాడు. మొదట్లో అతని ఆలోచనలు వెనక్కు వెళ్లాయి. గజపతినగరం, విశాఖపట్నం, కాలేజీ, నాటకాలు, పాటలు. స్టేజిమీద నిలబడి తాను పాటలు పాడుతూ ఉంటే సభికుల చప్పట్లు, హర్షనాదాలు ఇవన్నీ అతని బుర్రలో తిరిగాయి. క్రమంగా అతని ఆలోచనలు వెనుకనుంచి ముందుకు ప్రసరించాయి. తాను పనిచెయ్యబోయే ఫేక్టరీ, అక్కడ తన హోదా, ముందు ముందు గడించబోయే డబ్బు, పెరగబోయే తన జీవిత స్థాయి—అన్నీ దూరంలో ఉజ్జ్వల భవిష్యత్తు స్పష్టంగా కనిపిస్తోందతనికి. తన జీవితానికి స్పష్టమైన రేఖ ఏర్పడుతున్నట్టుగా తోచింది. రాయపూరు చేరడానికి ముందర పడుకొన్నాడు.

మర్నాడు ప్రొద్దున్న రాయపూరు చేరాడు. ఆశ్చర్యం! ఫేక్టరీ ప్రొప్రయిటరే స్వయంగా స్టేషన్‌కి తనను రిసీవ్ చేసుకొందుకి వచ్చాడు. అతని కార్లోనే తనకై నిర్దేశింపబడిన ఇంటికి వెళ్లాడు. 'స్నానం చేసి, భోంచేసి, విశ్రాంతి తీసుకొండి. నేను మధ్యాహ్నం మూడు గంటలకి వచ్చి మిమ్మల్ని ఫేక్టరీకి తీసుకు వెళ్తాను. ఈ పూటకి మీకు భోజనం మా ఇంట్లోంచి పంపిస్తాను.' అన్నాడు ప్రొప్రయిటరు. మోహనరావు చాలా సంతోషించాడు. ప్రొప్రయిటరు తనపట్ల చూపుతున్న ఆదరణకు.

ఇల్లు విశాలంగా సదుపాయంగా ఉంది. తన కుటుంబానికి అవసరమైన దాని కన్నా చాలా పెద్దదిగా ఉంది. [illegible] ఆ ఇల్లు, ప్రొప్రయిటరు ఆదరణ అతని మనస్సులో ఏమూలో మిగిలివున్న కొన్ని అనుమానాలు తొలగించాయి. హాయిగా స్నానంచేశాడు. కాస్త సేపట్లో కేరియర్ పట్టుకొని ఒకడు వచ్చాడు. వస్తూనే నమస్కారంచేసి ఎంతో చనువుగా గడగడ హిందీలో మాట్లాడ సాగాడు. మోహనరావుకి పచ్చి వెలక్కాయ గొంతుకలో పడ్డట్టయింది. అతనికి వచ్చిన హిందీ అల్లా 'అచ్ఛాబాత్‌హై' అని మాత్రమే. ఆ మాటలనే వాడుతూ వాడితో సంభాషణ చేస్తున్నట్టూ చెయ్యనట్టూ కాలక్షేపం చేశాడు. కొంత సేపటికి అతని స్థితిని అర్థం చేసుకొని 'మీకు హిందీరాదా?' అని అతను అడిగాడు. రానట్టుగా మోహనరావు తల ఊపాడు. ఇద్దరినీ నిశ్శబ్దం ఆవహించింది. భోజనం ముగించాడు మోహనరావు.

'మీరు నిద్రపోండి' అని కేరియర్ కడిగి దొంతిపెట్టుకొని తీసుకొని వెళ్లిపోయాడతడు. మోహనరావు పక్కపరచి పడుకొన్నాడు. నిద్ర వచ్చేటట్టులేదు. సంచి విప్పి పుస్తకం తీశాడు. సగం చదివిన తెలుగు నవల అది. తన అభిమాన రచయిత వ్రాసినది. కథ మంచిపట్టులో ఉంది. గబగబ చదివి ముగించాడు.

రెండున్నర కాగానే లేచి డ్రస్సయి తయారయాడు. ప్రొప్రయిటరు మూడున్నర దాకా రాలేదు. అతనితో ఫేక్టరీకి వెళ్లాడు. చీఫ్ కెమిస్టుతోనూ ఇతరులతోనూ పరిచయంచేసి తన సీటును చూపించాడు ప్రొప్రయిటరు. సాయంకాలం అయింది. తిరిగి తనకారులోనే అతణ్ణి ఇంటికి చేర్చాడు.

'ఈ వీధిలో ఒక మద్రాసు హోటలుంది. అక్కడ మీకు భోజనం బాగుంటుంది' అని సూచించి వెళ్లిపోయాడు ప్రొప్రయిటరు.

రోజులు గడుస్తున్న కొద్దీ మోహనరావు ఫేక్టరీపనికీ, క్రొత్త వాతావరణానికీ అలవాటు పడ్డాడు. పని అంత ఎక్కువగా లేదు. కంపెనీ తయారు చేస్తున్న మందులు మొత్తం పదహారు. వాటిలో ఆరింటికి మంచి అమ్మకం ఉంది, తక్కినవి సాధారణం. అందుకే నెలకి పదిహేను రోజులు గట్టి పని ఉంటుంది. తక్కిన రోజుల్లో ఒకమాదిరిగా ఉంటుంది.

చీఫ్‌కెమిస్టు దాస్ బెంగాలివాడు. అతని అసిస్టెంటు భట్టాచార్యా అలహాబాద్‌కి చెందినవాడు. ఆ యిద్దరూ దాదాపు ఐదేళ్ళయి ఆ కంపెనీలో పనిచేస్తున్నారు. టెస్టింగ్ సెక్షనులో తానొక్కడే. ఒక గుమాస్తా, టైపిస్టు, పాతికమంది పనివాళ్ళూను. పనివాళ్ళలో ముగ్గురు తెలుగువాళ్ళు కూడా ఉన్నారు. మొదట్లో వీళ్ళ సాయం హిందీ నేర్చుకొనడంలో అతనికి చాలా అక్కరకు వచ్చింది. రెండునెలలలో సంభాషణలకి చాలినంతగా హిందీని అభ్యసించ గలిగాడు.

ఫేక్టరీలో ఉద్యోగంలో చేరి మూడునెలలైంది. ఒకనాడు ఆఫీసు నౌకరు కొన్ని కాగితాలు తీసుకొచ్చి 'చీఫ్ కెమిస్టుగారు వీటిమీద మీ సంతకాలు చేయించి తెమ్మన్నారు.' అని అన్నాడు. ఏవో మామూలు కాగితాలే అనుకొని పెన్ను తెరచి ఆ కాగితాలను యథాలాపంగా చూశాడు. మొదట్లో అర్థం కాలేదు. కొన్ని మందులను టెస్టుచేసి అవన్నీ స్టాండర్డ్సు ప్రకారం సరిగా ఉన్నాయని తాను సర్టిఫై చేయవలసిన కాగితాలవి. తాను వచ్చినప్పటినుంచీ మందులు సకాలంలో టెస్టుచేసి ఎప్పటికప్పుడు ఆ సర్టిఫికేట్లను సంతకంచేసి చీఫ్ కెమిస్టుకి పంపుతూనే ఉన్నాడు. ఏవీ బాకీ పెట్టలేదు.

# ఉద్యోగం

మరి ఈ కాగితాలేమిటి?

తన నోట్‌బుక్ తీసి చూసుకొన్నాడు. కాని ఆ మందుల బేచ్ నెంబర్లు తన నోట్‌బుక్‌లో కనిపించలేదు. అవి తాను రాకముందు తయారు చెయ్యబడిన మందులు. వాటిమీద తానెలాగ సంతకం పెడతాడు? బహుశా చీఫ్ కెమిస్టు పొరపాటున ఆ కాగితాలు తనకి పంపించి ఉండవచ్చును.

'ఈ కాగితాలమీద నేను సంతకం పెట్టనక్కరలేదు.' అని వాడితో చెప్పాడు.

'మంచిది సాబ్' అని వాడు వెళ్ళాడు. ఐదు నిమిషాలలో మళ్ళీ వచ్చాడు.

'దాస్ సాబ్ మిమ్మల్ని పిలుస్తున్నారు' అన్నాడు. మోహనరావు వెళ్ళాడు. దాస్ మోహనరావుతో మాట్లాడాడు.

'ఆ కాగితాలలోని మందులు మీరు రాకపూర్వం తయారైనవే. అయినా ఏం ఫరవాలేదు. అవన్నీ అదివరకే అమ్ముడు పోయాయి. అవి సరిగ్గా ఉన్నాయని నిరభ్యంతరంగా సంతకం పెట్టవచ్చును.' దాస్ అన్నాడు.

'నేను రాకపూర్వం తయారైన మందులని నేనెందుకు సర్టిఫై చెయ్యాలి? ఇదివరకు పనిచేసిన కెమిస్టు చెయ్యలేదా?' అడిగాడు మోహనరావు.

'ఇదివరకటి కెమిస్టు ఏడాది క్రితం రిజైనుచేసి వెళ్ళిపోయాడు. తర్వాత మీరు వచ్చేదాకా ఆ మందులు అర్జెంటుగా సప్లయి చెయ్యవలసి వచ్చింది. కొన్ని బేచ్‌లు తయారు చేశాం. అన్నీ సరిగానే చేశాం. పైగా అవన్నీ అమ్ముడు పోయాయి. అందుచేత మీరు సర్టిఫై చెయ్యొచ్చును.' అన్నాడు దాస్.

మోహనరావు ఐదు నిమిషాలు ఆలోచించాడు. చేసిన మందులు టెస్టు చేసి సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోకుండానే అమ్మేశారు వీళ్ళు! అసలు సరిగా చేశారో లేదో!

'పోనీండి. ఆ శాంపుల్స్ ఉన్నాయా? టెస్టుచేసి సర్టిఫై చేస్తాను.' అన్నాడు.

'కొన్ని ఉన్నాయి, కొన్ని లేవు. అయినా అవన్నీ ఇప్పుడు టెస్టు చెయ్యడం అనవసరం. టెస్టు చెయ్యడానికి టైము కూడా లేదు. రెండురోజులలో (డగ్గి)న్స్పెక్టరు వస్తున్నారు. అప్పటికి రికార్డ్సు అన్నీ సరిగా ఉంచి చూపించాలి.' అన్నాడు దాస్. మోహనరావేమీ మాట్లాడలేదు. తాను టెస్టు చెయ్యని మందులు సరిగా ఉన్నట్లు తానెలా సర్టిఫై చేస్తాడు? అది తన వృత్తి ధర్మానికి విరుద్ధం.

'ప్రొప్రయిటరుగారు మీతో ఈ విషయమై ఏమీ మాట్లాడలేదా?' అడిగాడు దాస్.


'లేదు.'

'అయితే మీతో మాట్లాడారను కొన్నాను. సరే. అయితే మీతో మాట్లాడతారు లెండి.' అని దాస్ తప్పుకొన్నాడు.

మధ్యాహ్నం ప్రొప్రయిటరు మోహనరావుతో మాట్లాడాడు. ఆ సంభాషణతో మోహనరావు ఉద్యోగ జీవితం మరో మలుపు తిరిగింది.

'ఫరవాలేదు. ఆ కాగితాలమీద సంతకం చేసెయ్యండి. తక్కినదంతా నేను చూసుకొంటాను.' అన్నాడు ప్రొప్రయిటరు.

'అవి నేను టెస్టు చెయ్యలేదు కదా!



# ఉద్యోగం

వాటిని గురించి నేనెందుకు బాధ్యత వహించాలి?' అడిగాడు మోహనరావు.

'మీరు ఫ్యాక్టరీ ఉద్యోగంలో క్రొత్తగా చేరారు. దీనిలోని సాధక బాధకాలు మీకు తెలియవు. రూల్స్ ప్రకారం పోతే బిజినెస్ అసలు చెయ్యలేం. బిజినెస్‌తో మీరు కో ఆపరేట్ చెయ్యాలి తప్ప రూల్సు పట్టుకు కూర్చుంటే పని నడవదు. చాలా చిన్న విషయంలో మీరు పట్టు పడుతున్నారు.' అన్నాడు ప్రొప్రయిటరు. క్షణం ఆగి 'ఇలా అయితే మీరు మా కంపెనీలో ఉద్యోగం చెయ్యడం కష్టమే' అన్నాడు.

అంతరాత్మకి వ్యతిరేకంగా కాగితాల మీద సంతకం చేయడు మోహనరావు. తెల్లనిబట్టలు, పైకి ఎంతో మర్యాదా చూపే స్వభావం, నిగనిగమంటున్న చక్కని కారుగల ప్రొప్రయిటరు మనస్సు ఎంత కుటిల మైనది!


ఆనాటి నుంచి ఫ్యాక్టరీ వ్యవహారాలని జాగ్రత్తగా కనిపెట్టసాగాడు. నెల రోజుల్లో ఫ్యాక్టరీ వ్యాపారం అంత సరి అయినది కాదనీ, వెనకాల కొంత గందరగోళం ఉందనీ తెలుసుకొన్నాడు. అతనికి భయం కలిగింది. కాని చీఫ్ కెమిస్టు డాప్‌ని చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. తనకన్నా దాప్‌కే బాధ్యత ఎక్కువ. మందుల విషయంలో గవర్నమెంటుతో ఏదైనా చిక్కు వస్తే ముందుగా దాప్‌కి దెబ్బ. కాని దాప్ ఎంత నిశ్చింతగా ఉన్నాడు! తాను అక్రమం చేస్తున్నాననే ఆలోచనే అతనికి లేదు. దాప్ చేస్తున్న అక్రమాలతో తాను చేస్తున్నది ఏదో వంతైనా లేదు. అయినా తన కెందుకింత ఆందోళన?

ఏమయినా అతనికా ఫ్యాక్టరీ మీద మనస్సు విరిగి పోయింది. తొందరగా ఆ ప్రదేశాన్ని వదిలి అంతకన్నా జీతం తక్కువైనా ఇంకొక మంచి ఫ్యాక్టరీకి పోవాలని నిశ్చయించాడు. ఫ్యాక్టరీలన్నీ బొంబాయిలో ఉన్నాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక తెప్పించి దానిలో పడుతున్న ఉద్యోగాలన్నిటికీ అప్లికేషన్లు పెట్టడం ప్రారంభించాడు.

రిగ్రెట్ జవాబులు తప్ప ఒక్క అప్లికేషనుకీ ఇంటర్వ్యూకి రమ్మని జవాబు రాలేదు. ఏడాది గడిచిపోయింది. లక్ష్మణరావు అనే తన స్నేహితుడొకడు బొంబాయిలో ఒక సుప్రసిద్ధమైన మందుల ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి సలహాని అర్థిస్తూ ఉత్తరం వ్రాశాడు. ఎక్కడో దూరప్రదేశంలో ఉండి బొంబాయిలోని కంపెనీలకు అప్లికేషన్లు పెడితే లాభం లేదనీ, ఆ ఊళ్లో ఉన్నవాళ్లనే సాధారణంగా ఇంటర్వ్యూలకి పిలుస్తారనీ వ్రాశాడు. అయితే, ఇకముందు పెట్టే అప్లికేషన్లలో రాయపూరు ఎడ్రసు కాకుండా తన కేరాఫ్ ఎడ్రసు ఇస్తే, లోకల్ కేండిడేటనుకున్న భ్రమతో ఇంటర్వ్యూకి పిలుస్తారనీ, అప్పుడు తాను ఉత్తరం వ్రాసి తెలుపుప చేస్తాననీ సూచించాడు. ఈ సూచన ప్రకారం మోహనరావు మళ్లీ పుంఖానుపుంఖాలుగా అప్లికేషన్లు పెట్టనారంభించాడు. నెల రోజులు గడిచాక ఒకనాడు లక్ష్మణరావు దగ్గరనుంచి ఎక్స్‌ప్రెస్ ఉత్తరం వచ్చింది. ఫలానా కంపెనీలో ఫలానా తేదీన నిన్ను ఇంటర్వ్యూకి పిలిచారు వెంటనే రమ్మని. చెల్లెలికి పెళ్లి అర్జెంటుగా నిశ్చయమైందని విశాఖపట్నం వెళ్లాలని చెప్పి పదిహేనురోజులు సెలవు తీసుకొని మోహనరావు బొంబాయికి బయలుదేరాడు.

ఆ కంపెనీవాడు మోహనరావును సెలెక్టు చెయ్యలేదు. ఇతని అనుభవం వాళ్లకి పనికి రాలేదు. ఇంకొక వారం రోజులలో ఇంకొక ఇంటర్వ్యూ వచ్చింది. వాళ్ళు కూడా అతణ్ణి సెలెక్టు చెయ్యలేదు. డిగ్రీ పెద్దదే అయినా అతనికి అనుభవం మంచిది లేకపోవడం గొప్ప ప్రతిబంధకంగా ఉంది. పదిహేనురోజులు బొంబాయిలో గడిపి, వాళ్లనీ వీళ్లనీ కలుసుకొని, చెయ్యగలిగిన ప్రయత్నమంతా చేసి నిస్పృహతో నిరాశగా రాయపూరు తిరిగి వచ్చాడు.

మూడురోజుల తర్వాత లక్ష్మణరావు దగ్గరనుంచి టెలిగ్రాం వచ్చింది. ఒక సుప్రసిద్ధ మైన కంపెనీవాళ్లు ఇంటర్వ్యూకి రమ్మని పిలిచారు. ఇంటర్వ్యూకి నాలుగురోజులు మాత్రమే వ్యవధి ఉంది. కాని ఇప్పుడు మళ్లీ సెలవు ఎలాగ సంపాదించడం? మొన్ననే ఒక దొంగ కారణాన్ని చెప్పి సెలవు తీసుకొన్నాడు. వచ్చి మూడురోజులే అయింది. టెలిగ్రాం కాగితాన్ని మడిచి పక్కని పారేశాడు. మళ్లీ వెంటనే బొంబాయి వెళ్లడం సాధ్యం కాదు. మరో ఒకటి రెండు పోయాక చూడవచ్చును. తిరా వెళ్ళి వాళ్లుకూడా సెలెక్టు చెయ్యక పోవచ్చును.




అనుకొన్నాడు. కాని మళ్ళీ అతనికి మన
సొప్పలేదు. వచ్చిన అవకాశాన్ని జార
విడుచుకోవడం ప్రోత్సాహ కాదు. ఏ పుట్టలో
ఏ పాముందో! వెళ్ళడానికే నిశ్చయించు
కొన్నాడు. సెలవు సంపాదించడానికి ఒక
ఉపాయం ఆలోచించాడు. అప్పటికి అతని
భార్య వాళ్ళ పుట్టింట్లో ఉంది.
ఆమెకు టెలిగ్రాం ఇచ్చాడు. కూతురు
సీరియస్‌గా ఉంది వెంటనే రమ్మని
తనకి టెలిగ్రాం ఇమ్మని. మర్నాడు
సాయంకాలం కల్లా ఆవిధంగా టెలిగ్రాం
వచ్చింది. వెంటనే ప్రొప్రయిటరు
గారింటికి ఆ టెలిగ్రాం పట్టుకొని వెళ్ళి
పదిరోజులు సెలవు సంపాదించి ఆ రాత్రే
బొంబాయికి బయలుదేరాడు.

ఆ కంపెనీలో ఉద్యోగం అతనికి లభిం
చింది, మేన్యుఫేక్చరింగ్ సెక్షన్‌లో అసి
స్టెంట్ కెమిస్ట్‌గా. తిరిగి వాయుపూరు
వచ్చి రిజైను చేశాడు. ప్రొప్రయిటరు
ఉగ్రుడై మాట్లాడాడు. 'నువ్విలా
ప్రవర్తిస్తావనుకోలేదు. నిన్ను రిలీవ్
చెయ్యను. నువ్విక్కడ నీకాది పని చేసి
నట్టు నేను సర్టిఫికేటు ఇవ్వను.'
అంటూ దబాయించాడు. మోహనరావుకి
ఒళ్ళు మండింది. మనసులో ఆందోళన
ప్రారంభమయింది. ఇక్కడనుంచి తప్పించు
కోవడమెలాగ! వీడు సర్టిఫికేటు ఇవ్వక
పోతే ఆ కంపెనీవాళ్ళు ఏమంటారో!
దాస్‌తో ఈ విషయం మాట్లాడాడు
'మీరేం భయపడకండి. ఎవడికోసం రిలీవ్
చేస్తాడు? వాడూ వాడి బాబూ కూడా
రిలీవ్ చెయ్యాలి. అంతగా వాడు
మిమ్మల్ని రిలీవ్ చెయ్యకపోతే మీరే
ఫలానా తేదీతో వాడి కంపెనీలో ఉద్యోగం
మానేస్తున్నట్లు వాడికి పేరే రిజిష్టరు
నోటీసిచ్చి మీ దారిన మీరు పొండి.
మహా అయితే మీ కొక నెల జీతం నష్టం
అవుతుంది. అంతకన్నా వాడు మిమ్మల్ని ఏం
చెయ్యలేడు' అన్నాడు.

క్షణం ఊరుకొని 'మీరీ కంపెనీలో
చేరుతున్నప్పుడే అనుకొన్నాను, ఇక్కడ
చేరడం పొరపాటు చేస్తున్నారని. ఇప్పుడు
మీకు మంచి అవకాశం వచ్చింది. మీరు
యువకులు. వృత్తిలోకి రావలసినవారు.
పైకొస్తారు! నా కెరీర్ ఎలాగూ పాడయి


మీ అందమైన శిరోజములకు పోషణ
మరియు పుష్టి అవసరము





# బెంగాల్ కెమికల్స్

## కాంతరైడిన్ హేర్ ఆయిల్

నిడుపాటి నిగనిగలాడే,
మృదువైన కేశములు
పెరుగుటకు సహాయపడును.
మతికి చేరనీయదు.
రాలిపోవడం నిల్పును.

బెంగాల్ కెమికల్
కలకత్తా * బొంబాయి
కాన్పూరు * ఢిల్లీ

R.S.
DAYAL
INK REGD.
దయాల్ ఇంక్
BEST FOR ALL PENS
DAYALBAGH INK FACTORY
KAKINADA

ఆరోగ్య సౌభాగ్యములకు
ఏ హాని కలుగకుండా
ఆరోగ్య అనారోగ్య చికిత్సలకు
**లోధ్ర**
గర్భదోషములకు, సుఖప్రసవమునకు
**గర్భరక్షక**
పిల్లలకు, పెద్దలకు
**మహిళల రసాయనం**
బలహీనతకు, కీళ్ళనొప్పికి
**సౌభాగ్య శాంతి**
68 సంవత్సరముల పైగా
ప్రసిద్ధి గాంచిన ఔషధములు.
**కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్**
మదరాసు-14
ఏజెంట్లు :
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజెన్సీ)
విజయవాడ.
Swastik

నేర్చుకోవటానికి అద్భుత సాధన
**30 రోజులలో తమిళ భాష**
తమిళభాష చదవడానికి, వ్రాయడానికి, మాట్లాడటానికి సులభ పద్ధతిలో తెలుగు మూలంగా 30 రోజులలోనే నేర్చుకొనవచ్చును. రచన. విద్వాన్ కె. శ్రీనివాసాచార్యులు. కాపీదర రు. 2-50. వి.పి.పి. ద్వారా రు. 3-50. కావలసినవారు వెనువెంటనే వ్రాయండి. వివరములకు:
**బాలాజీ పబ్లికేషన్స్,**
**17, ఆయిల్ మోంగర్ వీధి, మద్రాసు-14.**

**వాయిదా చెల్లింపు పద్ధతిన నెలకు రు. 10 కట్టి ట్రాన్సిస్టరు పొందండి!**

World Famous Powerful
"నేషనల్ 70" ఏరియల్ జపాన్ మోడల్ ఆకర్షణీయమైనది, గొప్ప గలది. డయల్ లైట్ సెల్ వరల్డ్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టర్. ప్రతి గ్రామానికీ ఏజెంట్లు కావలెను.
WRITE YOUR LETTER TODAY
MUSIC E SOUND (N)
P BOX 1576, DELHI-6

# ఉద్యోగం

పోయింది. 'ఎం డాక్టర్ కేర్' అన్నాడు దాస్ సిగరెట్టు దమ్ములాగుతూ, తన కెరీర్ పాడైపోవడం సిగరెట్టు దమ్ములాగినంత తేలికనా.

'మరి, నేనిక్కడ సంవత్సరం పనిచేసినట్టు సర్టిఫికేటియ్యకపోతే ఎలాగ?' మోహనరావు అడిగాడు.

'ఎవడిక్కావాలి పిడి సర్టిఫికేటు. బోడి సర్టిఫికేటు ఇస్తే ఇవ్వనీ లేకపోతే మానేయమనండి. అనతిలాభ కంపెనీలో పనిచేసినట్టు సర్టిఫికేటు పుచ్చుకోడం ఒక డిస్క్వాలిఫికేషను. నేనింతవరకూ ఇలాటివి తొమ్మిది కంపెనీలలో పనిచేశాను. ఐదు కంపెనీలు మాత్రం నాకు సర్టిఫికేట్లిచ్చారు. అంతగా వాడివ్వకుంటే, సర్టిఫికేటు మీకు అత్యావశ్యకమైతే, వాళ్ళకి తెలియకుండా సీల్ కొట్టిచ్చి పోదాంలే నే ఇస్తాను' అని సలహా చెప్పాడు. ఎన్నో కంపెనీలలో పనిచేసి ఎందర్నో ప్రొప్రయిటర్లనూ వాళ్ళ జిత్తులనూ చూసిన దాస్. మోహనరావు మనస్సు కుతకుతలాడింది. దాస్ మీద అతనికి ఇదివరకు లేని గౌరవం ఏర్పడింది. దాస్ తన వృత్తిలో అక్రమాలను అవలీలగా చేస్తున్నాడంటే అతని తప్పుకాదది. అతను పనిచేసిన కంపెనీలు అతణ్ణి అలాగ మార్చాయి. నాలుగురోజులు గాక మోహనరావు తన ప్రొప్రయిటరుతో ఈ విషయమై ప్రస్తావించాడు.

'మన అగ్రిమెంటు ప్రకారం నెల రోజుల నోటీసు మీకిచ్చాను. నెల్లాళ్ళలోగాని ఇంకా ముందుగాని నన్ను రిలీవ్ చెయ్యండి' అని అడిగాడు. ప్రొప్రయిటరు శాంతించి చూశాడు.

'ఇలా మధ్య మధ్యలో వెళ్ళిపోతే ఎలా? నా బిజినెస్ అంతా ఆగిపోతుంది. ఇంకొక కేండిడేటు నీ స్థానంలో వచ్చేవరకూ నిన్ను రిలీవ్ చెయ్యలేను' అంటూ ప్రారంభించాడు. బొంబాయి కంపెనీ వాళ్ళిచ్చేదాన్నా తానే జీతం ఇస్తానని మరో ఏభై రూపాయలు పెంచుతానని ఆశ చూపాడు. కాని మోహనరావు బొంగకుండా- నెల కాగానే వెళ్ళిపోతాననే పట్టు బట్టాడు. ఎలాగో తేలిగ్గా ప్రొప్రయిటరు అతణ్ణి రిలీవ్ చేశాడు. మోహనరావు బొంబాయి వెళ్ళి, జాయిన్ అయ్యాడు. అప్పటితో అతని ఉద్యోగం మరొక మలుపు తిరిగింది.

ఎనిమిదేళ్ళు గడిచాయి. బొంబాయిలో మోహనరావు మూడు కంపెనీలు మార్చాడు. పెళ్ళి చేసుకుంటే ధర్మపత్నితో ఆనందమయమైన జీవితం గడుపుతున్నట్టు అతని జీతం గబగబ పెరిగిపోయింది. ఒక గొప్ప పేరున్న కంపెనీలో సెక్షన్ హెడ్ అయ్యాడు. విద్యార్థిదశలో ఉండగా నిరీక్షిస్తున్న భవిష్యత్తుకోసం కలలు కన్నాడో అవన్నీ నిజమైనాయి. అనుకొన్న హోదా, ఆదాయం లభించాయి.

ఎనిమిదేళ్ళలో అతని దేహం మార్పులు పొందింది. ముఖం కండరాలతో ఉబ్బి ఆరోగ్యంతో నిగనిగలాడుతోంది. అతని కన్నా అతని భార్య మరీ లావయ్యింది. కుర్రాడు పిల్లలూ ఆరోగ్యంగా ఉన్నారు. మొదటి పిల్లవాడు ఇంగ్లీషు స్కూలులో చదువుతున్నాడు.

పైకి ఇంత ప్రశాంతంగా పోతున్నా అతని జీవితంలో లోలోపల ఒక వేదన, వైరాగ్యం మూడేళ్ళుగా [illegible] అవతరించుకొని వచ్చింది.

బొంబాయి నగరంలో రోడ్లమీద పరుగెత్తుతున్న వాహనాలలోనూ, ఫ్యాక్టరీలలో తిరుగుతున్న యంత్రాలలోనూ ఎటువంటి చైతన్యం ఉందో తన జీవితంలోనూ అంతే చైతన్యం ఉంది. ఈ జీవితానికి పరమార్థమేమిటి?

క్షణం విశ్రాంతి లేదు అతనికి. ప్రొద్దున్నే ఆఫీసుకు ఇంటినుంచి బయలుదేరుతాడు. మళ్ళీ రాత్రి ఎనిమిది గంటలకు తిరిగివస్తాడు. ప్రతిరోజూ ఇదే పరుగు. అతని పిల్లలు పొద్దున్నే అతను ఇంటినుంచి బయలుదేరేసరికి ఇంకా లేవరు. రాత్రి అతను వచ్చేసరికి నిద్రపోయి ఉంటారు. వాళ్ళనిద్దర్నీ ఆదివారం నాడు మాత్రమే చూస్తాడు. చిన్నప్పుడు ఎన్నో పుస్తకాలు చదివేవాడు. ఇప్పుడు పుస్తకం మొహం చూసి ఏళ్ళు కావొస్తోంది. ఎప్పుడైనా రాత్రిపడుకోబోతూ ఆంధ్రపత్రిక, వారపత్రిక, అదైనా చదవాలని చూస్తే, నిద్రకోసం చదవడం తప్ప ఇంకేం లేదు.

పూర్వం అతనిలో ఖచ్చితమైన సాహిత్యాభిరుచి ఉండేది. ఒకటో రెండో కథలు వ్రాశాడు. నవలలు చదవడం, వాటిలో పాత్రలను గురించి మిత్రులతో తీవ్రంగా చర్చించడం పరిపాటిగా ఉండేది. ఇప్పుడతని సాహిత్య వ్యాసంగం మెలకువకీ నిద్రకీ మధ్యనుండే వంతెన, సుషుప్త చైతన్యంగా మారింది. విసుగెత్తి పోయాడు జీవితంతో; ప్రత్యేకగాని మార్పు లేని, ప్రతిక్షణం కదులుతున్నా మొత్తం మీద ఏమీ కదలికలేని సముద్రంలో జలకణం వంటి జీవితంతో.

బస్సులో కూర్చొని ఆఫీసుకి వెళ్తూ ఉంటే వెనక్కు నిర్గమిస్తున్న రోడ్లు, దుకాణాలు, మనుష్యులు చూస్తున్నా గమనించనివి. ఒకనాడిలాగే బస్సులో ఆఫీసుకు వెళ్తూ ఉండగా తన ప్రక్కసీటులో కూర్చున్నాయన ఐదునిమిషాలు తనను పరకాయించి చూస్తూ ఉంటే—

'ఓహో! ప్రభాకరరావు! ఏమిటిలాగ రావడం?' అన్నాడు తానే ముందుగా గుర్తుపట్టి.

'ఓహో! మోహనరావు!' అన్నాడతడు ఆశ్చర్యంగా.

ఆశ్చర్యం, సంతోషం పెనవేశాయి ఇద్దర్నీ. ఎనిమిది తొమ్మిదేళ్ల తర్వాత అకస్మాత్తుగా కలుసుకొన్నారు మిత్రులు.

ప్రభాకరరావు కాలేజీలో స్నేహితుడు. వాల్తేరులో లెక్చరరుగా ఉన్నాడట. ఏదో పనిమీద బొంబాయి వచ్చాడట. మోహనరావు అతనికి తన ఎడ్రసు ఇచ్చి ఆదివారం ప్రొద్దున్న తప్పక రమ్మనికోరాడు.

ఆదివారం పర్వదినంలాగ వచ్చింది. ప్రభాకరరావుతో చాలా సరదాగా గడిచింది ఆరోజు.

'మోహనరావ్! ఒక మంచిపాట పాడవోయ్. ఏదీ—కాలేజీలో నువ్వు తరచుగా పాడిన పాట 'కన్నీటి కెరటాల వెన్నెలలా' అన్న కృష్ణశాస్త్రి గేయం పాడవోయ్' అని చనువుగా అడిగాడు ప్రభాకరరావు. ఆ మాటతో మోహనరావు మనస్సు చివుక్కుమంది. అతనికి పూర్వజన్మస్మృతి వచ్చినట్లయింది. ఇప్పుడు తాను పాడగలడా ఇంక? తన జీవిత సంగీతం ఎప్పుడో శ్రుతి తప్పి పోలేదా? అంతా మిథ్య. జీవితం ఒక వ్యర్థ ప్రయాస.

'పాటపాడే అలవాటు తప్పిపోయిందోయ్' అని మాత్రం అనగలిగాడు. సాయంకాలం ప్రభాకరరావు వెళ్లిపోయాడు. ప్రభాకరరావు రాకతో మోహనరావు మనస్సులో ఆవేదనకి ఒక స్పష్టరూపం వచ్చింది. 'బొంబాయిని వదిలి వెళ్లిపోవాలి, జీవితంలో మార్పును చూడాలి' అని అభిప్రాయం కలిగింది.

ఢిల్లీలో ఒక పెద్ద మందుల ఫేక్టరీ క్రొత్తగా పెట్టారు. దానికి అప్లికేషను పంపాడు. ఇంటర్వ్యూకి రమ్మన్నారు. ఆ ప్రయాణానికి ఏర్పాటు చేసుకొంటూ ఉండగా, ఇటీవల హైదరాబాదులో నెలకొల్పబడిన ఇంకొక మంచి ఫేక్టరీనుంచి కూడా ఇంటర్వ్యూకి రమ్మని వచ్చింది. ఇద్దరికీ ఇంటర్వ్యూకి వస్తున్నట్లు వ్రాశాడు.


ముందు ఢిల్లీ కంపెనీలో ఇంటర్వ్యూ. పదిహేనువందల జీతంమీద సెలక్టయాడు. ఆ ఆర్డరు తీసుకొని అక్కడనుంచి హైదరాబాదుకు వెళ్లాడు. అక్కడ కూడా సెలక్టుచేస్తామన్నారుగాని పన్నెండువందలే ఇస్తామని, ఏడాది అయాక మూడువందలు ఎక్కువ చేస్తామని అన్నారు.

మోహనరావు బేరమాడాడు. ఢిల్లీ కంపెనీ వాళ్ల ఆర్డరు చూపించాడు. అయినా వాళ్లు ఒప్పుకోలేదు. అతనివంటి క్వాలిఫికేషనూ అనుభవమూ ఉన్నతనే ఒకరు నిన్ననే ఇంటర్వ్యూకి వచ్చారనీ, ఈ జీతాన్ని అతడు అంగీకరించాడనీ చెప్పారు. వాళ్ల షరతులకే మోహనరావు ఒప్పుకొన్నాడు. వాళ్లు వెంటనే ఆర్డరు ఇయ్యలేదు. ఆ మరునాడు ఇంకొకరిని ఇంటర్వ్యూ చెయ్యవలసి ఉందనీ, ఆ తర్వాత తననే సెలక్టు చేసినట్లయితే వారం పదిరోజులలో పోస్టులో ఆర్డరు పంపుతామనీ అన్నారు.

మోహనరావు బొంబాయివచ్చేసి కంపెనీకి నెలరోజుల నోటీసుతో రిజిగ్నేషను ఇచ్చాడు. వారం రోజులలో హైదరాబాదు నుంచి కూడా తననే సెలక్టు చేస్తూ ఆర్డరు వచ్చింది.

ఇప్పుడు ఆలోచనలో పడ్డాడు. అటు ఢిల్లీయా ఇటు హైదరాబాదా వెళ్లడం? రెండూ మంచి కంపెనీలే. జీతం కొంచం ఢిల్లీలో ఎక్కువే అయినా హైదరాబాదు తనకి అన్నివిధాలా అనుకూలమైన ఊరు. అక్కడ తన భాష, తన ప్రజలు. అతనిలో తెలుగుదనం ఉప్పొంగింది.

'లీలా? హైదరాబాదు వెళ్దామా?



ఢిల్లీ వెళ్దామా?' అడిగాడు భార్యని. ఆమె కూడా తనతో ఏకీభవిస్తుందని అతనికి తెలుసును.

'హైదరాబాదే వెళ్దామండీ. మా అన్నయ్యా, వదిన్లూ అక్కడే ఉన్నారు' అందామె. కాని పిల్లలు 'ఢిల్లీ వెళ్దాం, ఢిల్లీ వెళ్దాం' అన్నారు; ఢిల్లీ ముఖ్య పట్టణం, అక్కడంతా మజాగా ఉంటుందని వాళ్ల ఊహ. వాళ్ల మాటలకి తానూ భార్యా నవ్వుకొన్నారు.

ఢిల్లీ కంపెనీకి రానని వ్రాసేశాడు. హైదరాబాదు వచ్చాడు. ఏడాది నడిచింది. హైదరాబాదులో బొంబాయిలోకన్నా కొంత మట్టుకు ప్రశాంతిగానే ఉంది. ఫ్యాక్టరీ పని సమానమేనయినా ఇతరత్రా విరామం దొరుకుతోంది. పైగా ఊళ్లో చాలామంది చుట్టాలు, స్నేహితులూను. కొత్తల్లోంచి బయటపడ్డట్టుగా ఉందతనికి.


అంతట్లో ఏమరుపాటుగ ఉన్న లేడి మీద హఠాత్తుగా పులి దూకి పడ్డట్టుగా తెలంగాణా ఉద్యమం వచ్చి పడింది. లూటీలు, స్త్రీల మానభంగాలు, సజీవ దహనాలు—వీటిలో తెలుగువారి సంస్కృతి గౌరవం కొల్లగొట్టబడి, దగ్ధమై, బూడిదయిన రోజులు విజృంభించాయి. సూర్యుడి ఉదయాస్తమయాలతో పాటు రోడ్డుమీద పోతున్న పౌరులకు, రోజా

# ఉద్యోగం

రాళ్ల దెబ్బలు, పోలీసు లాఠీ ఛార్జీలు, కాల్పులుకూడా సహజమైపోయాయి జంట నగరాల్లో. ఎక్కడ చూసినా బీభత్సం, ఉద్రేకం, వైషమ్యం.

'ఆంధ్ర! గోబేక్. ఆంధ్ర! గోబేక్. లాఠీగోళీ ఖాయేంగే, తెలంగాణా లాయేంగే.' అంటూ నినాదాలుచేస్తూ లారీల్లో పోతున్న జనసందోహాలు. తెలుగువారిని తెలుగుదేశం విడిచి వెళ్లిపొమ్మని, తెలుగువాళ్లని విడిపొమ్మని ఇతర భాషలలో నినాదాలు చెయ్యబడుతున్న ఈ సన్నివేశం తెలుగుప్రజల చరిత్రలో చాలా విచిత్రమైనదని అతనికి తోచింది. తాళికోట యుద్ధం తర్వాత తెలుగు ప్రజలకీ తెలుగు సంస్కృతికీ చరిత్రలో జరిగిన ఘోర పరాజయం ఇదే నేమో! తాళికోట పరాజయం ఇతరుల వల్ల వచ్చినది. ఇది అలాటిది కాదు. తెలుగువారిని తెలుగువారే ద్వేషించుకొంటున్నారిప్పుడు... పైగా ఆంధ్రులంటేనే, ఎవరయినా ఇష్టపడని కాలము' అని నినాదమేమిటి? ఢిల్లీనే పోలించింది. వెళ్లకపోయి ఇక్కడికి వచ్చామా అని అనుకూ అతనూ భార్యా చాలా విచారించారు.

అంతా భయంగా విషాదంగా ఉంది.




ఇదివరకు యథేచ్ఛగా వెళ్లిన రోడ్లమీద ఇప్పుడు ఒదిగి ఒదిగి సందేహంగా భయంగా ఏదో తప్పు చేస్తున్నట్టు జంకుతూ వెళ్లవలసి వస్తోంది. రోజూ చూస్తున్న మనుష్యులే కాక చివరికి చుట్టూ ఉన్న ఇళ్ళు, గోడలు, చెట్లూ కూడా ఇప్పుడు తలచేసి శత్రుత్వంతో కసిగా చూస్తున్నట్టు అనిపించింది.

రోజూ వేల సంఖ్యలో కోస్తా తెలుగు ప్రజలు హైదరాబాదునుంచి ప్రాణాలు పిడికిటిలో పెట్టుకొని పారిపోతున్నారు. పురుషులు ప్రాణాలకూ, స్త్రీలు ప్రాణ మానాలకూ కాపాడుకొందుకి భయ భ్రాంతులై పారిపోతున్నారు.

'మీరిక్కడ ఉద్యోగం చెయ్యడానికి వీల్లేదు. ఉండడానికి వీల్లేదు. రెండు రోజుల్లో ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోండి. లేకపోతే మిమ్మల్ని చంపేస్తాం.' అని ఒక ఉత్తరం అతనికి వచ్చింది. పక్కింటి గోపాలరావుతో మాట్లాడాడు. 'నాకూ వచ్చింది, ఈ ప్రాంతంలో ఆంధ్ర కుటుంబాలందరికీ వచ్చింది. పోలీసులకి చెప్పాను. మరేం ఫరవాలేదు.' అని అతను ధైర్యం చెప్పాడు. మనిషికీ మనిషికీ మనసు కలియాలి తప్ప ఈ పోలీసులెన్నాళ్లు రక్షిస్తారు? అని అనుకొన్నాడు మోహనరావు.

ఏరోజు కారోజు [illegible] ఫ్యాక్టరీకి వెళ్లిరావడమే గండంగా ఉంటోంది. ప్రతిదినం అతను సాయంకాలం వచ్చేవేళకు అతనికోసం ఇంట్లో నాలుగు జతల కళ్ళు ఆత్రంగా ఎదురు చూస్తూ ఉంటున్నాయి. వాటిలో ఒక జత కళ్ళు ప్రణయ సర్వస్వమై విశాలమైనవి. తక్కిన మూడు జతలూ బాల్యంచేత అమాయకమైనవి.

ఒక సాయంకాలం ఆరున్నర గంటలకు స్కూటరుమీద నారాయణగూడా లోంచి వస్తూ ఉండగా అల్లంత దూరంలో ఆందోళన జరుగుతూ ఉండడం


అతను చూడలేకపోయాడు అయినా అంతకు ముందుగా కొద్దిదూరంలో సందులోకి తిరిగి పోవచ్చునని స్కూటరుని పోనిచ్చాడు. అంతలో ఒక రాయి ఫట్మని మొహంమీద తగిలింది. దిమ్మదిరిగి పోయాడు. వెనకాలే వస్తున్న లారీడ్రైవరు ఎంత ప్రయత్నించినా తప్పించలేక పోయాడు. లారీ క్రింద మోహనరావు అక్కడికక్కడే చచ్చిపోయాడు. ఆరోగ్యంతో మిసమిసలాడుతూ ఉండేది అతని ముఖం గుర్తుపట్టరాకుండా పచ్చడయి పోయింది పాపం! లారీడ్రైవరు చాలా విచారించాడు ప్రమాదాన్ని తప్పించలేక పోయినందుకు.


మోహనరావు మనస్సూ అలవాట్లూ చాలా సున్నితమైనవి. ఎవరితోనూ పరుషంగా మాట్లాడి ఎరగడు. మృదువైన స్వభావం, ఆరోగ్యవంతమైన శరీరం. కాని విధి మాత్రం అతన్ని ఎందుకో ద్వేషించి పగ తీర్చుకొంటున్నట్లు కఠినంగా చంపేసింది.

అతని మృతి ప్రజలను అంతగా దుఃఖితులనూ విషాద భరితులనూ చెయ్యలేదు. నాళ్ళ, అందులోనూ హత్య సాధారణ సంఘటన అయిపోయిన అక్కడ యాక్సిడెంటులు జరిగిన ఈ సామాన్య మృతిని ఎవరూ అంతగా పట్టించుకోలేదు.

ఆనాడు నగరంలో చాలాచోట్ల ఆందోళనలూ, ఖూనీలూ, పోలీసు కాల్పులూ జరగడంవల్ల వార్తాపత్రికలన్నీ ఆవార్తలతోనే నిండిపోయాయి. ఒక మూలని మోహనరావు చచ్చిపోయిన వార్త పడ్డింది. దానికీ దాంతో నిమిత్తంలేని నాయకుల కళ్ళకి మాత్రం ఆవార్త అంధకారంలో అవతరించింది.

ఆ సాయంకాలం ఆరున్నర గంటలకు హైదరాబాదు నగరంలో నారాయణగూడా రోడ్డుమీద లారీ క్రింద మోహనరావు ఉద్యోగాన్వేషణ ఆఖరి మలుపు తిరిగి అంతమొందింది. ●


ఏజంట్లు: ది క్రెడిట్ ప్రమోటింగ్ కార్పొరేషన్
బకింగ్‌హాం పేట, విజయవాడ—2.

